

ప్రయాణం యమడేంజర్

అధికారులు నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో లింకు రహదారులపై ప్రయాణానికి ఇబ్బందులు తప్పటం లేదు. 8లో..



70మంది.. ఒక ఉపాధ్యాయుడు

విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్న చోట ఉపాధ్యాయులు తక్కువ.. తక్కువ విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు ఎక్కువ ఉన్నారు. 9లో..



ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలి

ముదిరాజ్‌లను అవమానించిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. 9లో..

తొలకరి పరవశం

- ఆరుద్రలో కురుస్తున్న వర్షాలు
- సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు
- జిల్లాలో 5,78,700 ఎకరాల్లో సాగు అంచనా



దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రోహిణి పాయె.. మృగశిర పాయె.. వర్షాలు వస్తయో రావో అని ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతన్నలను తొలకరి పలకరించింది. ఆరుద్ర కార్తెలో నైరుతి రుతు పవనాలు ప్రవేశించడంతో జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చినుకు లేక చింతగా ఉన్న అన్నదాత ముఖాల్లో చిరునవ్వు వచ్చి చేరింది. పొలాలు పదును కావడంతో సాగుబాట పట్టారు.

- గత రెండు కార్తెలు ఎలాంటి వర్షాలు లేకుండానే ముగియడంతో రైతుల్లో ఆందోళన కనిపించింది. రోహిణి కార్తెలో విత్తనాలు విత్తితే మంచి దిగుబడి వస్తుందని నమ్మకం. కానీ ఈ ఏడాది వానాకాలంలో రెండు కార్తెలు పూర్తయినా వర్షాలు కురవలేదు. ఆరుద్ర కార్తె మొదలవగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో నాలుగు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి.
- వానలు కురుస్తుండటంతో రైతులు సాగుబాట పట్టారు. సాగునీటి సౌకర్యం ఉన్నవారు ముందుగానే దుక్కులు సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుత వర్షాలకు భూమిని దున్నడంతో పాటు పశువుల ఎరువులు చల్లుతున్నారు.
- జిల్లాలో 6.30లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, 3 లక్షల మంది పట్టాదారు రైతులు ఉన్నారు. అధికంగా వరి, మొక్కజొన్న, పత్తి, కందులు సాగవుతాయి. అందుకు తగిన విధంగా వ్యవసాయ అధికారులు విత్తనాలు, పంటలకు సరిపోను ఎరువులు సిద్ధం చేశారు.
- ఈ వానాకాలం సీజన్‌లో 4లక్షల ఎకరాల్లో వరి, 36వేల ఎకరాల్లో మొక్కజొన్న, లక్షా 30 వేల ఎకరాల్లో పత్తి, 12,500 ఎకరాల్లో కందులు, 14 ఎకరాల్లో పెసళ్లు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గత వర్షాకాలం 5,25,959 ఎకరాల్లో పంటలను సాగు చేయగా, ఈసారి 5,78,700 ఎకరాల్లో సాగు అంచనాతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 49,500 మెట్రిక్ టన్నుల యూరియా, 4,765 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,731 మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 44,875 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది.
- సాగు భూమిలో కనీసం 60మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయితేనే విత్తనాలు విత్తాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే విత్తితే మొలకెత్తక నష్టపోవాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు వేయడానికి తేలికపాటి నేలల్లో 60మిల్లీమీటర్లు, బరువు నేలల్లో 70మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం తప్పని సరి అని అధికారులు తెలుపుతున్నారు. పత్తి విత్తనాలు జూలై 15 వరకు, కందులు ఆగస్టు 15 వరకు విత్తుకునే అవకాశం ఉంటుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

భారీ వర్షాలు పడ్డాకే విత్తుకోవాలి



రెండు రోజులుగా అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. ఈ వానకు విత్తనాలు వేయొద్దు. కనీసం 60 మిల్లీమీటర్ల వర్షం కురిసిన తరువాతే, భూమిలోని వేడి బయటకు వస్తుంది. అప్పుడు విత్తు మొలకెత్తే అవకాశం ఉంటుంది. అందువలన భారీ వర్షం కురిసిన తరువాతే విత్తనాలు విత్తాలి. జూలై 15 వరకు పత్తి, ఆగస్టు 15 వరకు కందులు విత్తుకునే అవకాశం ఉంటుంది.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

మోస్తరు వర్షం



ఏన్సాన్‌పల్లి చౌరస్తాలో కురుస్తున్న వర్షం

జిల్లా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు కురిశాయి. దీంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంది. తొగుట మండలం రాంపూర్ గ్రామంలో 62మిమీల వర్షపాతం నమోదైంది. కొన్ని రోజులుగా ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు, వాతావరణంలో మార్పు రావడంతో ఉపశమనం పొందుతున్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళా రైతులు

ములుగు(గజ్వేల్): ఆధునిక పద్ధతుల ద్వారా సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రాష్ట్ర కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.నీరజప్రభాకర్ తెలిపారు. మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా ములుగులోని ఉద్యాన విశ్వ విద్యాలయంలో సిద్దిపేటకు చెందిన నేలమ్మ మహిళా రైతుల సహకార సంఘం సభ్యులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ సిబ్బంది లావణ్య, డా.సల్మ, డా.లక్ష్మినారాయణలు పెరటి తోటల పెంపకం, ఎండిన పూలతో వివిధ వస్తువుల తయారీ, పసుపు నారు మడిలో మెలకువల గురించి వివరించారు. అదేవిధంగా శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై అటవీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శైలజ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డా.కిరణ్‌కుమార్, సాజయ, రుక్మిణి, జ్యోత్స్న, సింధూజ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు న్యాయ విజ్ఞానం అవసరం



మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థులకు న్యాయ విషయాలపై పరిజ్ఞానం అవసరమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ అన్నారు. శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి పెంపొందించాలన్నారు. అదేవిధంగా నేరాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాలోతు గంగాధర్‌నాయక్, న్యాయవాదులు దీకొండ ప్రవీణ్, రాజశేఖర్, రవి, శ్రీరాం పాల్గొన్నారు.

పారదర్శకంగా ధ్రువపత్రాల పరిశీలన




ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేట కమాన్: పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించినవారి ధ్రువపత్రాలను పారదర్శకంగా పరిశీలించినట్లు సీపీ శ్వేత శనివారం తెలిపారు. 4,409 మంది అభ్యర్థులు అర్హత సాధించగా, 3,926 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ పరిశీలించారు. కార్యక్రమంలో సీపీ కార్యాలయ సూపరింటెండెంట్లు, ఐటీ కోర్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం

చేర్యాల(సిద్దిపేట) : చేర్యాల వ్యవసాయమార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని శనివారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. చైర్మన్‌గా ఆకునూరు గ్రామానికి చెందిన సుంకరి మల్లేశంను రెండోసారి నియమించినట్లు చెప్పారు. వైస్ చైర్మన్‌గా పుర్మ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లుగా శనిగరం సత్యనారాయణ, నలగొప్పుల రాములు, మేక ఉమామహేశ్వర్, బుట్టి ఆగమల్లు, తాటికొండ సదానందం, జిల్లెల మహేందర్‌రెడ్డి, బామండ్లపల్లి రాజు, భీమ రాజు, వంగ రామరాజు, మేర్గు కృష్ణ, జిల్లా రాజేశం, బాశెట్టి బుచ్చిరాములుతో పాటు బచ్చన్నపేట పీఏసీఎస్ చైర్మన్, సిద్దిపేట జిల్లా మార్కెటింగ్ అధికారి, చేర్యాల ఏడీఏ, చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ కొనసాగేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీజేఎస్ జిల్లా కన్వీనర్‌గా నీరుడి స్వామి



గజ్వేల్‌రూరల్: తెలంగాణ జన సమితి (టీజేఎస్) సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా గజ్వేల్ పట్టణానికి చెందిన నీరుడి స్వామి నియామకమయ్యారు. హైదరాబాద్‌లో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ చేతుల మీదుగా శనివారం ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా కో కన్వీనర్ అనిల్‌రెడ్డి, ప్రవీణ్, స్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



భవనాన్ని పరిశీలిస్తున్న పర్వతరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): జులైలో పీఆర్సీ కమిటీని నియమించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఎస్టీయూ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, చేర్యాల ఎస్టీయూ బాధ్యుడు రాచమళ్ల శ్రీనివాస్, రైతు బంధు జిల్లా కమిటీ సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం

వెండి కిరీటాన్ని బహూకరించిన మంత్రి హరీశ్‌రావు తల్లి



వెండి కిరీటంతో తన్నీరు లక్ష్మీబాయి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి తన్నీరు హరీశ్‌రావు సొంత ఖర్చులతో నిర్మించిన చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు తల్లి లక్ష్మిబాయి స్వామివారికి వెండి కిరీటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ మాజీ చైర్మన్ కచ్చు రాజయ్య, నాయకులు బోయినిపెల్లి శ్రీనివాస్‌రావు, గౌతంరావు, లింగాల లక్ష్మణ్, రామచందర్‌రావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్, గంగపుత్రులకు పెద్దపీట

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): ముదిరాజ్‌లు, గంగపుత్రులకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం వర్గల్ మండలం నెంటూరులో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఏడీ మల్లేశం పర్యవేక్షణలో చేపలు పట్టడంపై నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గంగపుత్రులకు, ముదిరాజ్‌లకు ప్రతియేటా రూ.100 కోట్ల వ్యయంతో చేపపిల్లలను పంపిణీ చేస్తున్నట్లు గుర్తు చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో 100 ముదిరాజ్, గంగపుత్రుల సొసైటీల ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్యామలసాదుల్లగౌడ్, ఫిషరీస్ డైరెక్టర్ సత్తయ్య, కనకరాజు, నాగరాజు, రాజు, ఆంజనేయులు, కిష్టయ్య, సత్తయ్య, స్వామి, నర్సింలు పాల్గొన్నారు.

పుస్తక విక్రయ కేంద్రాలుగా ప్రైవేట్ పాఠశాలలు

బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతాలు యాదవ్



చేర్యాల(సిద్దిపేట): ప్రైవేటు పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా పుస్తక విక్రయ కేంద్రాలుగా మారాయని, వాటిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలన్నారు. పాఠశాలల్లోనే టై, బెల్టు, షూ, యూనిఫాం, పాఠ్య పుస్తకాలను విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. టెక్నో, ఐఐటీ కోచింగ్‌లు అంటూ కరపత్రాలు ముద్రించి అక్రమంగా అడ్మిషన్లు పొందుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించాలని కోరారు.

గిరిజన బంధు హామీ ఏమైంది..?



మాట్లాడుతున్న నూనావత్ మోహన్ నాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): మునుగోడు ఉప ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ గిరిజనులందరికీ గిరిజన బంధు ఇస్తానని ఇచ్చిన హామీ ఏమైందని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు నూనావత్ మోహన్‌నాయక్ అన్నారు. శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు కాకుండా రూ.5 లక్షలు ఇవ్వాలని, తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్తరేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు గిరిజనులపై కపట ప్రేమను చూపి, గద్దెనెక్కిన తర్వాత సవతి ప్రేమ చూపుతున్నాయని మండిపడ్డారు. కొన్ని తండాలకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేదన్నారు. ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. తండాల్లో తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వ మోసంపై అవగాహన కల్పిస్తామన్నారు. అదేవిధంగా గిరిజనులను ఏకతాటిపైకి తీసుకొచ్చి పోరుబాటకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు బానోతు అనిల్‌నాయక్, ప్రధానకార్యదర్శి రైనా నాయక్, వీరానాయక్, గణేష్‌నాయక్, తిరుపతి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

జేఏసీ చైర్మన్ తునికి మహేశ్

సిద్దిపేటరూరల్: గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి, జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచాలని జీపీ కార్మిక జేఏసీ చైర్మన్ తునికి మహేశ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జీపీ కార్మికుల సమస్యల పరిష్కారం, పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేసి వారు మాట్లాడారు. జూలై 6 నుంచి నిర్వహించే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.51 తీసుకొచ్చి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశ పెట్టిందని, వివిధ కేటగిరీలను రద్దుచేసి కలం పట్టిన కారోబార్, బిల్ కలెక్టర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పేరుతో రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అమ్ముల బాలనర్సయ్య, బాకీ యాదగిరి, బాలనర్సవ్వ, పరశురాములు, రాజమౌళి, అండాలు, నరేష్ పాల్గొన్నారు.

తరగని సంపద చదువే..

జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట ఎడ్యుకేషన్: తరగని సంపద చదువు ఒక్కటేనని, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ అన్నారు. ఎన్ఆర్ఐ అలీషామధువర్షి సౌజన్యంతో లైబ్రరీ ఆన్ వీల్స్ అనే పేరుతో విద్యార్థులకు ఉపయోగపడేలా రూ.40 వేల ఖర్చుతో పుస్తకాలు, వీల్స్‌తో కూడిన ర్యాక్‌ను ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు శనివారం ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాలను బహూకరిస్తున్న అలీషాకు, సీఐఎస్ఎఫ్ కమాండెంట్లు అయిన ఆమె మిత్రులు రాకేష్‌నికాజ్, అలోక్‌పాండే, వేలేటి సుమంత్‌శర్మ, సాయిలను ఆమె అభినందించారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని, పాఠశాలలు, కళాశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవ చూపుతున్నారని చెప్పారు. డిప్యూటీ కమాండెంట్ 8వ రిజర్వ్ బెటాలియన్ జైపూర్ సీఐఎస్ఎఫ్ రాకేష్ నికాజ్ మాట్లాడుతూ అలీషా 16ఏళ్ల వయసులోనే పేద విద్యార్థులకు సాయం చేయాలనే ఆలోచనతో విరాళాలు సేకరించి సుమారు 100 లైబ్రరీ ఆన్ వీల్స్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, తెలంగాణలో ఈ లైబ్రరీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్ పశ్చిమబెంగాల్ దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్ సీఐఎస్ఎఫ్ వేలేటి సుమన్ శర్మ మాట్లాడుతూ ఇంటర్ పూర్తయిన తర్వాత అనేక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటాయని, ఆ దిశగా విద్యార్థులు ఆలోచించాలన్నారు. అధ్యాపకులు ప్రత్యేక చొరవ తీసుకొని స్టాఫ్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక అయ్యే ఉద్యోగాలకు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ లైబ్రరీ ఆన్ వీల్స్ ను కళాశాలకు అందించడం సంతోషంగా ఉందని, ఈ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు మాట్లాడుతూ సిద్దిపేట ప్రాంత విద్యాభివృద్ధికి మంత్రి హరీష్ రావు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, కనక చంద్రం, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, వెంకటరమణ, రఘురాజు, గంగాధర్, విజయభాస్కర్, రాజ్యలక్ష్మి, శ్రీలీల, వనజ, రూప, కార్యాలయ సిబ్బంది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థి ప్రతిభ



రాజు

సిద్దిపేట ఎడ్యుకేషన్: పాలీసెట్‌లో సిద్దిపేట బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ రెండవ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థి రాజు రాష్ట్ర స్థాయిలో 197ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

రేపటి నుంచి బడి బాట

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఈ నెల 26 నుంచి జూలై 6వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3 నుంచి జూన్ 17 వరకు నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఇది కొనసాగింపుగా ఉంటుందని తెలిపారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు నాచగిరి హుండీ లెక్కింపు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో సోమవారం హుండీ సొమ్ము లెక్కింపు చేయనున్నట్లు ఆలయ ఈఓ కట్టా సుధాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

దేశ భవిష్యత్‌కు యువతే కీలకం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్ రావు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అహ్మద్

సిద్దిపేటజోన్: దేశ భవిష్యత్ యువతే కీలకమని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక విపంచి ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, కవితలు, ఫొటోగ్రఫీ వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు వారు బహుమతులు అందజేశారు. అదేవిధంగా పోస్టల్, గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, సఖీ, ఇంధన శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ, క్రీడాశాఖ అధికారి నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

సిద్దిపేట కమాన్: డిమాండ్ల సాధన కోసం జూన్ 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలన్నీ ఎస్సీలకు 13 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలన్నారు. దళితులకు గృహ నిర్మాణం కోసం రూ.3లక్షల సాయాన్ని రూ.10లక్షలకు పెంచాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గానికి 5వేల మంది దళితులకు ఈ పథకం అమలు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాశపాక రాజేందర్, వెంకటేష్, సాయిలు, తిరుపతి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి



పల్లె పల్లెకు ప్రవీణ్ అన్న కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్రంలో మారుమూల గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. పల్లెపల్లెకు ప్రవీణ్ అన్న...గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బత్తులవానిపల్లె, లక్ష్మిపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామాల బాగోగులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బత్తులవాని పల్లెకు రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబాలకు చెందిన మూడు నియోజకవర్గాల్లోనే అభివృద్ధి జరిగిందని, మిగతా ప్రాంతాలకు ఒరిగిందేమీ లేదన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు బస్వరాజు శంకర్, మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, మాజీ సర్పంచ్ సుధాకర్, సీనియర్ నాయకులు బందెల బాలకిషన్, తిరుపతి రెడ్డి, జయరాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో ఖాదిరాబాద్ పీఏసీఎస్ డైరెక్టర్ కన్నుమూత


సంగారెడ్డి(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఖాదిరాబాద్ పీఏసీఎస్ డైరెక్టర్ ముంగె సంగారెడ్డి(60) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం ఆయన అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు లింగంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మరోసారి గుండెపోటుకు గురై మరణించారు. శనివారం తెల్లవారుజాము మృతదేహాన్ని కుటుంబసభ్యులు స్వగ్రామం గౌర్రెకల్‌కు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

వెల్దుర్తి(తూప్రాన్): విద్యాదాఘాతానికి పాడి గేదె మృత్యువాత పడింది. ఈ సంఘటన పంచాయతీ పరిధిలోని శేరీలలో జరిగింది. గ్రామానికి చెందిన యాదగిరి రోజుమాదిరిగా తన పాడి పశువులను గ్రామ సమీపంలో ఉన్న పంటపొలాల వద్దకు మేతకు తోలుకెళ్లాడు. అక్కడ ఓ దర్గా సమీపంలో పంటపొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో పాడి గేదె అక్కడికక్కడే మృతిచెందింది. దాని విలువ రూ.లక్షకుపైగా ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. విద్యుత్ అధికారులు పరిహారం అందించాలని కోరుతున్నారు.

మహదేవుపల్లిలో పోలీసు పికెట్

కల్హేర్(నారాయణఖేడ్): మహదేవుపల్లిలో శనివారం పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ నాగధర పాపయ్య అనుమానాస్పదంగా మృతిచెందడం తెలిసిందే. పాపయ్యను హత్య చేసి రోడ్డు పడ వేసి ప్రమాదంగా చిత్రీకరించారని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో అనుమానిత వ్యక్తుల ఇళ్లపై దాడులు నిలువరించేందుకు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండేందుకు పికెట్ ఏర్పాటు చేశామని కల్హేర్ ఎస్‌ఐ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

ఎద్దుల అక్రమ తరలింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జహీరాబాద్ నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో తరలిసున్న 14 ఎద్దులను రామచంద్రాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజాము జహీరాబాద్ నుంచి హైదరాబాద్‌కు 14 ఎద్దులను డీసీఎం వ్యాన్‌లో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు తరలిస్తున్నారు. రామచంద్రాపురంలోని ఇక్రిశాట్ పోలీస్ అవుట్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలో పట్టుబడ్డారు. ఆ మేరకు ఎద్దులను కూకట్‌పల్లి గోశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

దుబ్బాక: లచ్చపేట చీకోడ్ శివారులో శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 29,590 నగదు, 2 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

లింకు రోడ్లపై...
ప్రయాణం యమడేంజర్

- అధ్వానంగా ఝరాసంగంలోని పలు రహదారుల దుస్థితి ఇదీ..
- కంకర దెబ్బకు చుట్టూ తిరిగొస్తున్న వాహనదారులు.. తప్పని ఇబ్బందులు
- మరమ్మతులు చేపట్టాలంటున్న ఆయా గ్రామాల ప్రజలు


కంకర తేలిన కుప్పానగర్-బిడెకన్నె లింకు రహదారి

ఝరాసంగం (జహీరాబాద్): అధికారులు నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో లింకు రహదారులపై ప్రయాణానికి ఇబ్బందులు తప్పటం లేదు. గ్రామాల అనుసంధానానికి నిర్మించిన రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో అటు వైపుగా రాకపోకలకు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై పూర్తిగా కంకర తేలి, మట్టి దిబ్బలు, కంకర కుప్పలతో దర్శనమిస్తున్నాయి. చాలా ఏళ్ల క్రితం రహదారులను నిర్మించటంతో అవి ఇప్పుడు పూర్తిగా దెబ్బతిన్నాయి. రహదారులకు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాహనదారులు, ప్రయాణికులకు ఇక్కట్లు

దూరభారం తగ్గించటంతోపాటు సమయం ఆదా అవుతుందనే ఆశయంతో మండలంలోని పలు గ్రామాలను అనుసంధానిస్తూ లింకు రహదారులను ఏర్పాటు చేశారు.

- కుప్పానగర్ నుంచి బిడెకన్నె, ఈదులపల్లి నుంచి మాచ్నూర్, కొల్లూర్ నుంచి కక్కర్‌వాడ, సిద్దాపూర్, పొట్టిపల్లి నుంచి న్యాల్‌కల్ మండలం రేజింతల్, మాచ్నూర్ నుంచి క్రిష్టాపూర్, చీలపల్లి నుంచి సిద్దాపూర్, కొల్లూర్ నుంచి గంగాపూర్ వరకు లింకు రహదారులున్నాయి. అవి పూర్తిగా కంకర తేలి, మట్టికుప్పలతో దర్శనమిస్తున్నాయి. రహదారులు అధ్వానంగా మారటంతో ఇబ్బందులు తప్పటం లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు.
- మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు నియోజకవర్గం జహీరాబాద్‌కు నిత్యం ప్రజలు వివిధ పనులపై, విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారులు అధ్వానంగా ఉండడంతో చుట్టూ తిరిగి రాకపోకలు సాగిస్తున్నామని, దీంతో దూరభారంతోపాటు సమయం వృథా అవుతుందని పేర్కొంటున్నారు. అటువైపుగా రాకపోకలు సాగించే వారికి వాహనాలు పాడవుతున్నాయని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పలుమార్లు ద్విచక్రవాహనాలపై నుంచి అదుపు తప్పి కింద పడి గాయాలపాలైన సంద ర్భాలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

రహదారి పూర్తిగా కంకర తేలింది



కుప్పానగర్ నుంచి బిడెకన్నె వరకు ఉన్న లింకు రహదారి పూర్తిగా కంకర తేలి అధ్వానంగా మారింది. రాకపోకలకు ఇబ్బంది లు పడుతున్నాం. ఝరాసంగానికి ఈ దారి గుండా వస్తే దూరభారంతో పాటు సమయం ఆదా అవుతుంది. అధికారులు చర్యలు తీసుకుని లింకు రహదారి మరమ్మతులు చేపట్టాలి. – ఈరన్న, బిడెకన్నె

వానకాలంలో రాకపోకలు కష్టమే



ఝరాసంగం నుంచి గంగాపూర్ గ్రామానికి రాకపోకలకు కొల్లూర్ మీదుగా లింకు రహదారి ఉంది. వానకాలంలో రాకపోకలకు వీలు ఉండదు. వర్షానికి పూర్తిగా చిత్తడిమయంగా మారుతుంది. దీంతో రాయికోడ్ మండల పరిధిలోని ధర్మాపూర్ మీదుగా కప్పాడ్ నుంచి ఝరాసంగం రావాల్సి ఉంటుంది. దూరభారంతో పాటు సమయం వృథా అవుతోంది. – అంబేద్కర్, గంగాపూర్

కారును తప్పించబోయి.. డివైడర్‌ను ఢీకొట్టి..


బైపాస్‌లో బోల్తా పడిన లారీ

జహీరాబాద్ టౌన్: కారును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టి బైపాస్ రహదారిపై లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ముంబయి వైపు లోడ్‌తో లారీ వెళుతోంది. అదే రూటులో ప్రయాణిస్తున్న కారు ఓవర్ టేక్ చేస్తుండగా ఈ వాహనాన్ని తప్పించే క్రమంలో బీదర్ చౌరస్తా వద్ద లారీ డివైడర్‌ను ఢీకొట్టి బైపాస్ రోడ్డులో బోల్తాపడింది. రోడ్డు మధ్యలో బోల్తా పడడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న జహీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు. దీంతో వాహనాలు గమ్యస్థానాలకు బయలుదేరారు.

పస్తాపూర్ శివారులో రోడ్డు ప్రమాదంలో..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డుపై శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. బైపాస్ రోడ్డు పస్తాపూర్ శివారులో నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం తెలుసుకున్న ఎల్అండ్‌టీ పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జహీరాబాద్ పోలీసులకు సమాచారం అందించిడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జహీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ ఢీకొన్న కంటైనర్ లారీ

పటాన్‌చెరు టౌన్: ట్యాంకర్‌ను కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటన మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో శనివారం జరిగింది. ట్రాఫిక్ ఎస్‌ఐ రాములు కథనం ప్రకారం ఇస్నాపూర్ వైపు నుంచి కంటైనర్ లారీ, ట్యాంకర్ రెండూ సంగారెడ్డి వైపునకు వెళుతున్నాయి. హిండ్ వేర్ సమీపంలో ట్యాంకర్ యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో జాతీయ రహదారిపై ట్యాంకర్ బోల్తా పడింది. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ జామైంది. జేసీబీ సాయంతో ట్యాంకర్‌ను ట్రాఫిక్ పోలీసులు, పోలీసులు పక్కు తొలగింపజేశారు.

బస్సు ఢీ.. ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం


పర్వతం నర్సయ్య మృతదేహం

కొండపాక(గజ్వేల్): బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పర్వతం నర్సయ్య(70) ఇటీవల చిన్న కిష్టాపూర్‌లో కుటుంబంతో నివసిస్తున్నాడు. శనివారం ఉదయం చిన్నకిష్టాపూర్ నుంచి ద్విచక్ర వాహనంపై పర్వతం నర్సయ్య కుకునూరుపల్లికి వెళ్తున్నాడు. రాజీవ్ రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా బైక్‌ను జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తుల మృతి

వేర్వేరు చోట్ల ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటనలన్నీ చేగుంట, హత్నూర, బెజ్జంకి, కంది, రామచంద్రాపురం, ములుగుల్లో చోటుచేసుకున్నాయి. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం..



చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వడియారం గ్రామ శివారులో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వడియారం శివారులోని సిరిగోజి సత్యనారాయణ వ్యవసాయ బీడు భూమి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని అతడి గురించి విచారించగా వివరాలు తెలియరాలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సమీప పరిశ్రమల్లో పనిచేసే వలస కూలీగా గ్రామస్తులు అనుమానం వ్యక్తంచేశారు. వివరాలు తెలిస్తే చేగుంట స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యం

హత్నూర (సంగారెడ్డి): గుర్తుతెలియని మహిళా మృతదేహాన్ని రొయ్యపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో శనివారం పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం రొయ్యపల్లి అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ(35) మృతదేహం శనివారం మధ్యాహ్నం గొర్రెల కాపరులు గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతిచెంది సుమారు 10 నుంచి 15 రోజులైనట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి శరీరంపై పింకు నీలిరంగు చీర, ఎరుపు రంగు బ్లౌజ్ ధరించి ఉంది. సంఘటనా స్థలాన్ని జిన్నారం సీఐ వేణుకుమార్, ఎస్‌ఐ లక్ష్మారెడ్డి పరిశీలించి పంచనామా నిర్వహించారు.

స్పృహతప్పి పడిన వ్యక్తి..

బెజ్జంకి(సిద్దిపేట): గుర్తుతెలియని వ్యక్తి స్పృహతప్పి పడిపోయిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం బెజ్జంకి క్రాసింగ్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి(55) స్పృహ తప్పి పడిపోగా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతిచెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుడిచేతిపైన అంజమ్మ, రవి అనే పచ్చబొట్లు ఉన్నాయి. తెలిసిన వారు ఎవరైనా ఉంటే 87126-67324 నంబర్‌లో సమాచారమివ్వాలని విజ్ఞప్తి చేశారు.

మామిడిపల్లి చౌరస్తాలో...



కంది(సంగారెడ్డి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మండలకేంద్రమైన కంది శివారులో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డి కథనం ప్రకారం.. శనివారం మామిడిపల్లి చౌరస్తా సమీపంలో ఉన్న బీడు భూమిలో ఓ వ్యక్తి(45) మృతదేహం పడి ఉందన్న సమాచారంతో పోలీసులు అక్కడికెళ్లి స్వాధీనం చేసుకున్నారు. మృతుడు కొంతకాలంగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తుండే వాడని తెలిసింది. అనారోగ్యంతో చనిపోయి ఉండొచ్చని ఎస్సై భావిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిసినవారు రూరల్ సీఐ 87126-56719, ఎస్సై 87126-56747 నంబర్లలో సమాచారం ఇవ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి..



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ గుర్తు తెలియని వృద్ధుడు చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద ఈనెల 22న ఓ గుర్తుతెలియని వృద్ధుడు(65) రోడ్డుపై పడి ఉన్నాడని ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అతడిని చికిత్స నిమిత్తం పటాన్‌చెరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. ఆ వృద్ధుడు భిక్షాటన చేసుకుంటుంటాడని పోలీసులు తెలిపారు. వడదెబ్బ కారణంగా వృద్ధుడు మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తూరులో..

ములుగు(గజ్వేల్): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం మండలంలోని కొత్తూరు శివారులో గల ఈదుల్ల చెరువులో బయటపడింది. ఎస్‌ఐ రంగకృష్ణ కథనం ప్రకారం మరణించిన గుర్తుతెలియని వ్యక్తి(30) నీలిరంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతడి ఆచూకీ తెలియరాలేదు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహం పోస్టుమార్టం కోసం గజ్వేల్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712667338 నంబర్‌లో సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

బయటికెళ్లిన భర్త అదృశ్యం


ఆంజనేయులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం తుల్జాపూర్‌కు చెందిన ఆంజనేయులు, అతడి భార్య పద్మతో కలిసి మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి ముత్తంగిలో నివసిస్తున్నారు. ఇద్దరూ కూలి పని చేసుకుంటుంటారు. ఈ క్రమంలో ఈనెల 21న సాయంత్రం ఇంటి నుంచి బయటకెళ్లిన ఆంజనేయులు ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో భార్య తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. వెంటనే పోలీసులను ఆశ్రయించగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెకానిక్ షాప్‌కు వెళ్తున్నా..


ఫిరోజ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: మెకానిక్ షాప్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ఫిరోజ్, కేజీఎస్ మెకానిక్ షాప్‌లో పని చేస్తుంటాడు. ఫిరోజ్(24)కు చిన్ననాటి నుంచే మానసిక ఆరోగ్య పరిస్థితి బాగాలేక మందులు వాడుతున్నాడు. కాగా ఈనెల 23న మధ్యాహ్నం కేజీఎస్ మెకానిక్ షాప్ వద్దకు వెళుతున్నానని చెప్పి వెళ్లి ఎంతకీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫిరోజ్ కోసం తెలిసిన వారినీ, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. వెంటనే తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తులో ఉంది.

వివాహిత...


నీరజ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): వివాహిత అదృశ్యమైన సంఘటన మండల పరిధి మగ్దుంపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావ్ కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా ఇంద్రేశానికి చెందిన నీరజను శివ్వంపేట మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన చిట్టి కుమార్‌తో 6 నెలల క్రితం వివాహమైంది. అయితే భార్యాభర్తల మధ్య గొడవలు జరుగగా పెద్దలు సర్దిచెప్పారు. మనస్తాపం చెందిన నీరజ ఇంట్లో నుంచి శనివారం తెల్లవారుజాము వెళ్లిపోయింది. ఆమె కుటుంబసభ్యులు బంధువులను, స్నేహితులను విచారించినా ఆచూకీ లభించలేదు. నీరజ తల్లి భారతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారూ.. మా గ్రామస్తుడ్ని వెతకండి

పటాన్‌చెరు టౌన్: ఓ గ్రామస్తుడి అదృశ్యంపై మాజీ సర్పంచ్ ఫిర్యాదు చేసిన ఉదంతం భానూర్ పోలీసుస్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. రామచంద్రాపురం మండలం పరిధిలోని వెలమెల గ్రామానికి చెందిన ఉపెందర్ రెడ్డి(40) 2 నెలల నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులను, తెలిసిన వారిని సర్పంచ్ విచారించినా ఆచూకీ లభించలేదు. ఉపెందర్ రెడ్డిపై 2017లో పోచమ్మ టెంపుల్ విషమై అతడిపై పీడీ యాక్ట్ కేసు నమోదైందని, ఆ కేసులో కోర్టుకు కూడా రావడం లేదు. దీంతో మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు పిల్లలతో సహా తల్లి..


పద్మావతి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఓ తల్లి తన నలుగురు పిల్లలతో సహా అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం పటాన్ చెరు మండలం చిట్కుల్ వడ్డెర కాలనీకి చెందిన పోతరాజు వెంకటేశ్ మేస్త్రీ పని చేస్తుంటాడు. అతడికి భార్య పద్మావతి, ఇద్దరు కూతుళ్లు విగ్నేశ్వరి(6), శ్రీజ (5), కుమారులు సాయిరాం(3)సాయికృష్ణ (3) ఉన్నారు. ఈనెల 20(మంగళవారం)న వెంకటేశ్ పని మీద వేరే ఊరికెళ్లి అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో ఇంటికొచ్చే సరికే భార్య, కూతుళ్లు, కుమారులు కనిపించలేదు. వీరి కోసం తెలిసిన వారినీ, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్యాపిల్లలు అదృశ్యంపై వెంకటేశ్ శనివారం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రించిన చోటే యూపీ వాసి..

పటాన్‌చెరు టౌన్: పడుకున్న చోటే ఓ వ్యక్తి ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రవీ(28) పెయింటర్‌గా పనిచేస్తుండేవాడు. బతుకుదెరువు కోసం 2 నెలల క్రితం వచ్చి అమీన్‌పూర్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్గపూరి కాలనీలో ఓ భవన నిర్మాణ వద్ద పని చేసుకుంటున్నాడు. ఈక్రమంలో రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకొని శనివారం ఉదయం నిద్రలేవలేదు. అతడిని తోటి కార్మికులు నిద్రలేపగా లేవలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదు ఇచ్చేందుకెళ్తే పట్టించుకోలేదు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట బస్టాండ్ చౌరస్తాలో 2 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి తన సెల్‌ఫోన్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు పట్టించుకోక పోగా తనను తిట్టారని దీంతోనే ఆత్మహత్యకు యత్నించానని బాధితుడు ఆరోపించిన ఓ వీడియో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..

'మద్దూరు మండలం జాలపల్లి గ్రామానికి చెందిన చెట్కూరి నరేశ్ అనే నేను ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నా. సిద్దిపేటలో ఉంటున్నా. నా ఆటోలో పలు మార్కెట్లకు కూరగాయలు సరఫరా చేస్తుంటా. 4 రోజుల క్రితం నా సెల్‌ఫోన్ పోయిందని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదు. పైగా నన్నే దూషించడంతోపాటు చేయి చేసుకున్నారు. చేసేది లేక ఆత్మహత్యకు యత్నించాను. గతంలోనూ నేను రెండుసార్లు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో పోలీసులకు పట్టుబడ్డా. దీంతో నాపై రెండు డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు కేసులున్నాయి. నా బైక్ ఆర్‌సీ కూడా పోలీసుల దగ్గరే ఉంది' అని ఆరోపిస్తూ అతడికి సంబంధించిన ఓ వీడియో శనివారం బయటికొచ్చింది.

పోలీసుల వివరణ

నరేశ్ మాట్లాడేది అవాస్తమని వన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని సీఐ తెలిపారు. అతడి ఆత్మహత్యాయత్నం విషయమై తోటి ఆటో యూనియన్ నాయకులను సంప్రదించగా తాను ఎప్పుడూ మద్యం తాగుతాడన్నారు. దీనిపై త్రీటౌన్ సీఐ మాట్లాడుతూ, నరేశ్ పిటిషన్ ఇవ్వలేదన్నారు. స్టేషన్‌కు రాత్రి సమయంలో వచ్చి ఫోన్ తెచ్చారు ఇవ్వండని అడిగాడట, ఎవరు తెచ్చారని ప్రశ్నిస్తే నరేశ్ ఏమీ చెప్పలేదన్నారు. ఫోన్ పోయిందా? ఎవరైనా తీసుకున్నారా? అనేది అతడికే స్పష్టత లేదన్నారు.

సర్పంచ్, మాజీ సర్పంచ్ భర్తపై కేసు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేట సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ ప్రవంతి భర్త నవీన్‌గుప్తాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావ్ శనివారం తెలిపారు. నవీన్ గుప్తా ఇంటి ముందు ఉన్న పట్టా స్థలంలోని కడీలను విరగగొట్టి ఫెన్సింగ్ తొలగించిన సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్‌పై నవీన్‌గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే పంచాయతీ కందకంను నవీన్‌గుప్తా పూడ్చినందుకు గాను సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నవీన్‌గుప్తాపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు. వీరిద్దరూ అధికార పార్టీకి చెందిన నేతలు కావడం, పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

బాధితులకు ఫోన్ల అప్పగింత

వర్గల్(గజ్వేల్): ములుగుకు చెందిన తలారి రాజు, స్వామి వారం క్రితం ఫోన్లు పోగొట్టుకోగా గౌరారం పోలీసులు అప్పగించారు. సీఈఐఆర్ టెక్నాలజీతో స్వాధీనం చేసుకున్నామని ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఎంటర్ చేసి బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తులు అందులో సిమ్‌కార్డు వేయగా వారి వివరాలు వెబ్‌సైట్ ద్వారా పోలీసులకు చేరాయి. వారి నుంచి తీసుకొని బాధితులకు అందజేశారు.

చెట్టు తొలగించినందుకు జరిమానా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇంటి నిర్మాణానికి అడ్డు వచ్చిన చెట్టును జేసీబీతో తొలగించిన వ్యక్తికి మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. సిద్దిపేట 3వ వార్డు పరిధిలోని మహాశక్తి నగర్‌కు చెందిన భగవాన్‌రెడ్డి తన ఇంటి నిర్మాణానికి మట్టి తరలించే క్రమంలో అడ్డం వస్తున్న చెట్టును జేసీబీ సాయంతో తొలగించారు. దీంతో హరిత హారం అధికారి ఐలయ్య మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌ల ఆదేశాల మేరకు రూ.2వేల జరిమానా, ఐదు మొక్కలను నాటి రక్షించాలని సూచించారు.

మెకానిక్ షాపు దగ్ధం

సంగారెడ్డి టౌన్: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో మెకానిక్ షాపు దగ్ధమైన సంఘటన సంగారెడ్డి చౌరస్తాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని పోతిరెడ్డిపల్లి ఫ్లైఓవర్ వద్ద అనిల్‌కు బైక్ మెకానిక్ షాప్ ఉంది. శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే షాపు బంద్ చేసి వెళ్లారు. వెళ్లిన గంట సమయం తర్వాత షాప్ లోంచి మంటలు వస్తున్నాయని అందిన సమాచారం మేరకు తిరిగి వెళ్లే లోపు పూర్తిగా సామగ్రి కాలి బూడిదైంది. తనను దాతలు ఆదుకోవాలని అనిల్ కోరుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోవధ నిషేధ చట్టాలను అమలు చేయాలి

చేర్యాల(సిద్దిపేట): గోవధ నిషేధ చట్టాలను కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు తడక లక్ష్మణ్ కోరారు. ఆమేరకు సీఐ సత్యనారాయణరెడ్డికి శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు తడక లక్ష్మణ్ మాట్లాడుతూ గోవును వధిస్తే మహా పాపమన్నారు. ప్రతి ఏడాదీ బక్రీద్ సందర్భంగా రాష్ట్రంలో విచ్చలవిడిగా గోవధలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.